# విజయవాడపైనా పరిశోధన

**ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భాగమైన విజయవాడ నగరంలో భూకంపాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రెండు రకాల అధ్యయనం చేసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ట్రిబుల్ ఐటీ చేపట్టిన ఈ అధ్యయనంలో ఒకటి పూర్తికాగా మరొకటి చివరి దశకు వచ్చింది. గతంలో లాతూర్‌లో భారీ భూకంపం రావడంతో ప్రాణ నష్టం ఎక్కువైంది. దీంతో కేంద్ర ప్రభుత్వం దేశంలోని 64 నగరాల పరిధిలో భూకంప తీవ్రతను తెలుసుకోవాలని నిర్ణయించింది. వాటిలో విజయవాడ నగరం కూడా ఉంది. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ నిపుణులు అనేక మ్యాప్‌లు, భూగర్భ పరిస్థితి తదితరాలపై పరిశోధించి ఒక అంచనాకు వచ్చారు. ఇక్కడ నేల స్వభావం ఇతరత్రా అంశాలపై పరిశోధన చేసి, ఒకవేళ భూకంపం సంభవిస్తే ఇక్కడి భూమి ఎలాస్పందిస్తుంది.. ఏ ప్రాంతంలో ప్రకంపనలు అధికంగా ఉండే అవకాశం ఉందన్న దానిపై నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపించినట్లు ట్రిపుల్ ఐటీ ప్రతినిధి నీలిమ 'ఈనాడు'కు తెలిపారు. అలాగే రోడ్ల విషయంలోనూ పరిశోధనచేపట్టారు. ఒకవేళ భూకంపం వచ్చిన తరువాత అక్కడి ప్రధాన రోడ్లు ధ్వంసమైతే ప్రత్యామ్నాయంగా వేటిని ఉపయోగించుకోవచ్చన్న దానిపై అధ్యయనం చివరిదశకు వచ్చిందని నీలిమ తెలిపారు. త్వరలోనే ఈ నివేదికను కేంద్రానికి పంపుతామన్నారు.